

'సోషల్' సర్వీస్

గుజ్జ గ్రామానికి చెందిన శ్రీరామోజు శశికాంత్ సోషల్ మీడియా ద్వారా సామాజిక సేవ చేస్తున్నారు. - 8లో



భువనగిరి అభివృద్ధికి కృషి

భువనగిరి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. - 9లో



పేదల సంక్షేమమే ధ్యేయం

పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పాలన సాగిస్తుందని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య పేర్కొన్నారు. - 9లో

న్యూస్‌రీల్

నేడు ఎయిమ్స్‌లో యోగా దినోత్సవం

బీబీనగర్: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా బీబీనగర్‌లోని ఎయిమ్స్ వైద్య కళాశాలలో శనివారం యోగా వేడుకలు నిర్వహించనున్నట్లు ఎయిమ్స్ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు, వైద్య సిబ్బంది, విద్యార్థులు యోగాసనాలు వేయడంతో పాటు యోగా ప్రాధాన్యతను వివరిస్తారని పేర్కొన్నారు.

మత్స్యగిరిలో 28న వేలం పాటలు

వలిగొండ : మండలంలోని వెంకటాపురంలో గల మత్స్యగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈనెల 28న వేలం పాటలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ నరేష్‌కుమార్‌రెడ్డి, ఈఓ మోహన్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సత్యనారాయణస్వామి వ్రత సామగ్రి, ఫొటో స్టూడియో నిర్వహణ, కొబ్బరి కాయల విక్రయం, కూల్‌డ్రింక్స్, హోటల్ నిర్వహణకు సంబంధించి గతంలో వేలం వాయిదా పడగా తిరిగి నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

24న హుండీ లెక్కింపు

మత్స్యగిరి ఆలయంలోని హుండీల్లో భక్తులు సమర్పించుకున్న నగదు, ఇతర కానుకలను ఈ నెల 24 ఉదయం 10 గంటలకు లెక్కించనున్నట్లు ఆలయ చైర్మన్, ఈఓ తెలిపారు. దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో హుండీల లెక్కింపు ఉంటుందన్నారు.

కనులపండువగా ఊంజల్ సేవ



అమ్మవారికి ఊంజల్ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరి శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి సన్నిధిలో ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవ శుక్రవారం కనుల పండువగా నిర్వహించారు. సాయంత్రం వేళ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి తిరువీధుల్లో ఊరేగించారు. అనంతరం అద్దాల మండపంలోని ఉయ్యాలపై అమ్మవారిని అధిష్టింపజేసి ఆరాధించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రాల మధ్య ఊంజల్ సేవ నిర్వహించి అమ్మవారికి నివేదన సమర్పించారు.ఇక ప్రధానాలయంలో సంప్రదాయ పూజలు కొనసాగాయి. ప్రభాత వేళ సుప్రభాత సేవ చేపట్టిన అర్చకులు.. గర్భాలయంలోని స్వయంభూలు, సువర్ణ ప్రతిష్టా అలంకారమూర్తులను అభిషేకం, సహస్రనామార్చనలతో కొలిచారు. అనంతరం సుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, ముఖమండపంలో జోడు సేవోత్సవం తదితర పూజలు నిర్వహించారు.

పురుషులతో నాలుగు పొదుపు సంఘాలు

భువనగిరిటౌన్ : స్వయం సహాయక మహిళా సంఘాలు ఉన్నట్లుగా పురుషుల కోసం పొదుపు సంఘాలు ఏర్పాటవుతున్నాయి. భువనగిరి మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం ఒక్క రోజే మెప్మా ఆధ్వర్యంలో నాలుగు సంఘాలు ఏర్పాటు చేశారు. ఐదుగురితో కలిసి ఒక సంఘం ఏర్పాటు చేశారు. సంఘంలోని ప్రతి సభ్యుడు నెలకు రూ.వెయ్యి చొప్పున పొదుపు చేస్తే ఆరు నెలల తరువాత వ్యాపార నిమిత్తం రూ.50 వేలు ఇస్తారు. గరిష్ఠంగా రూ.1 లక్ష వరకు రుణం ఇవ్వనున్నారు. మున్సిపాలిటీలో పురుష సంఘాలు ఇప్పటికే ఆరు నడుస్తున్నాయి.

ఇందిరమ్మ ఇళ్ల పథకం.. పేదలకు వరం



రామాజీపేటలో ఇందిరమ్మ ఇళ్ల పనులను ప్రారంభిస్తున్న బండ్రు శోభారాణి

యాదగిరిగుట్ట రూరల్: నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం వరంలాంటిదని రాష్ట్ర మహిళా కో–ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బండ్రు శోభారాణి పేర్కొన్నారు.యాదగిరిగుట్ట మండలం రామాజీపేటలో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ భూమి పూజలో ఆమె పాల్గొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కానుగు బాలరాజ్‌గౌడ్, గ్రామశాఖ అధ్యక్షుడు కుండే సిద్ధులు, మాజీ ఉపసర్పంచ్ శంకర్, నాయకులు కొక్కొండ యాదగిరి, జహంగీర్, జానీ, నరసింహులు, కొమురయ్య, నరేష్, యాదగిరి, బలం రాజు పాల్గొన్నారు.



వానమ్మవానమ్మా.. ఒక్కసారన్న వచ్చిపోవమ్మా..

జూన్ మూడోవారం గడుస్తున్నా వర్షాలు లేకపోవడంతో వరుణ దేవుడి కోసం ఎదురు చూపులు తప్పడం లేదు. వర్షాలు కురువాలని యాదగిరిగుట్ట మండలం మహబూబ్‌పేటలో మహిళలు శుక్రవారం బతుకమ్మ ఆడారు. నీళ్ల బిందెలు తీసుకువచ్చి బొడ్రాయి వద్ద పూజలు చేసి వాన పాటలు పాడుతూ చుట్టుకాముడు వేశారు.

-యాదగిరిగుట్ట రూరల్

సర్వే నంబర్లపైనే ఎక్కువ!

ముగిసిన భూ భారతి రెవెన్యూ సదస్సులు

- మొత్తం దరఖాస్తులు 14,330
- అధికంగా మిస్సింగ్ సర్వే నంబర్లకు సంబంధించి 4,779
- నేటి నుంచి సమస్యలకు పరిష్కారం



గోపాల్‌పేటలో జరిగిన సదస్సులో రైతుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ హనుమంతరావు (ఫైల్)

సాక్షి, యాదాద్రి: భూభారతి రెవెన్యూ సదస్సులు శుక్రవారంతో ముగిశాయి. ఈనెల 3నుంచి 20వ తేదీ వరకు రెవెన్యూ గ్రామాల వారీగా నిర్వహించిన సదస్సుల్లో మొత్తం 14,330 దరఖాస్తులు వచ్చాయి. అందులో అత్యధికంగా మిస్సింగ్ సర్వే నంబర్లకు సంబంధించివి 4,779 అప్లికేషన్లు ఉన్నాయి. దరఖాస్తుల సత్వర పరిష్కారానికి రెవెన్యూ యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. మండలస్థాయిలో పరిష్కారం కానివి ఉంటే జిల్లాస్థాయికి పంపనున్నారు.

రెవెన్యూ డివిజన్లు	02
మండలాలు	17
రెవెన్యూ గ్రామాలు	318
మొత్తం దరఖాస్తులు	14,330

318 గ్రామాల్లో సదస్సులు

భూ భారతి చట్టం అమలులో భాగంగా జిల్లా వ్యాప్తంగా 318 రెవెన్యూ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. తొలుత పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన ఆత్మకూర్(ఎం) మండలంలోని 17 గ్రామాల్లో గత నెల సదస్సులు పూర్తి చేశారు. అనంతరం ఈనెల 3వ తేదీనుంచి షెడ్యూల్ ప్రకారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ధరణిలో పరిష్కారానికి నోచని సమస్యల ఆధారంగా బాధిత రైతులకు ఇంటింటికి వెళ్లి దరఖాస్తు ఫారాలు పంపిణీ చేశారు. రైతులు వాటిని నింపి రెవెన్యూ సదస్సుల్లో అధికారులకు అందజేశారు. హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించారు. అక్కడినుంచే వాటిని ఆన్‌లైన్ చేశారు.

దరఖాస్తులు ఇలా..

రెవెన్యూ సదస్సుల్లో మొత్తం 14,330 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో మిస్సింగ్ సర్వే నంబర్లు 4,779, పెండింగ్ మ్యుటేషన్లు 655, డీఎస్ పెండింగ్ 602, పాస్‌బుక్ కరెక్షన్ 667, సాదా బైనామాలు 2,301, భూముల రెగ్యులరైజ్ చేయాలని 412, ఇతర సమస్యలపై 545 వచ్చాయి.

సత్వర పరిష్కారం చూపుతాం



రెవెన్యూ సదస్సులు విజయవంతంగా ముగిశాయి. రైతులు పెద్ద సంఖ్యలో సదస్సులకు వచ్చి భూ సమస్యలపై దరఖాస్తు చేసుకున్నారు. వీటికి సత్వర పరిష్కారం చూపుతాం. సత్వర పరిష్కారానికి వీలుకాని దరఖాస్తులు ఉంటే అందుకు గల కారణాలను భూ యజమానులకు తెలియజేస్తాం.

-వీరారెడ్డి, అదనపు(రెవెన్యూ) కలెక్టర్

ఏరోజుకారోజే సీసీఎల్ఏకు

దరఖాస్తులను రెవెన్యూ సిబ్బంది ఏరోజుకారోజు కలెక్టర్‌కు నివేదించారు. కలెక్టర్ స్థాయిలో సమస్యల వారీగా నివేదిక రూపొందించి సీసీఎల్‌కు పంపించారు. సదస్సుల్లో కలెక్టర్ హనుమంతరావు, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డీఓలు కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి తదితర ఉన్నతాధికారులు పాల్గొని పర్యవేక్షించారు. దరఖాస్తులను పరిశీలించడంతో పాటు సమస్యలను నేరుగా తెలుసుకుని రైతులకు భరోసా ఇచ్చారు.

ప్రధాన సమస్యలు ఇవీ..

రెవెన్యూ సదస్సుల్లో అత్యధికంగా మిస్సింగ్ సర్వే నంబర్లకు సంబంధించి దరఖాస్తులు వచ్చాయి. పాస్ పుస్తకాల్లో భూముల సర్వే నంబర్లు లేకపోవడంపై రైతులు దరఖాస్తు చేశారు. అలాగే భూములను హోల్డ్‌లో పెట్టారని, వీటిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలని చౌటుప్పల్ మండలం అల్లాపురంతో పాటు మరికొన్ని గ్రామాల్లో రైతులు మొరపెట్టుకున్నారు. వీటితో పాటు వారసత్వం, అసైన్డ్, ఓఆర్‌సీ, 38–ఇ రాలేదని, సర్వే నంబర్లు, భూ యజమాని, తండ్రి పేరు, కులం, లింగం, ఆధార్ నంబర్ల తప్పులు. పాస్ పుస్తకాల్లో భూములు ఎక్కలేదని, మ్యుటేషన్, డిజిటల్ సంతకం కాలేదని తదితర సమస్యలపై రైతులు దరఖాస్తు చేసుకున్నారు. కొత్తగా సాదాబైనామాల దరఖాస్తులు కూడా వచ్చాయి.

ఎనభైలోనూ ఇరవైలా..

- ఆరు దశాబ్దాలుగా క్రమంతప్పకుండా యోగాసనాలు
- ఆదర్శంగా నిలుస్తున్న వెల్లంకి మాజీ సర్పంచ్ పున్న నరసింహ
- నేడు ప్రపంచ యోగా దినోత్సవం



సర్వాంగ ఆసనంలో పున్న నారసింహ

రామన్నపేట: వయసు పెరిగే కొద్దీ వ్యాయామాన్ని దూరం పెడుతుంటారు.. ఫిట్‌నెస్ లక్ష్యాలకు స్వస్తి పలుకుతుంటారు.. కానీ, అతను మాత్రం క్రమంతప్పకుండా 60 ఏళ్లుగా యోగాసనాలు వేస్తూ ఔరా అనిపించుకుంటున్నాడు. ఎనిమిది పదుల వయస్సులోనూ 20 ఏళ్ల యువకుడిలా కనిపిస్తుంటాడు. శాఖాహారం, క్రమంతప్పని యోగాసనాలే తన ఆరోగ్య రహస్యమని అంటున్నాడు.. పున్న నారసింహ.

1963 నుంచి యోగా..

రామన్నపేట మండలం వెల్లంకి మాజీ సర్పంచ్ పున్న నరసింహ 1938 డిసెంబర్ 13న పున్న ఈశ్వరయ్య–సత్తెమ్మ దంపతులకు జన్మించాడు. నాలుగో తరగతి వరకు స్థానికంగా తెలుగు, ఉర్దూ, ఉర్దూ భాషల్లో విద్యనభ్యసించాడు. వృత్తిరీత్యా చేనేత కుటుంబం అయినప్పటికీ నరసింహ బాల్యం నుంచే ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాల్లో పాల్గొనేవాడు. తోటి యువకులతో కలిసి నాటకాలు వేసేవారు. భార్య పేరు జగదాంబ. వీరికి ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు. నరసింహ చిన్నతనంలోనే 1963లో గాయత్రి ఉపాసన తీసుకున్నారు. అప్పటి నుంచి యోగా సాధన ప్రారంభించిన నరసింహ.. నేటికీ కొనసాగిస్తూనే ఉన్నాడు. పద్మాసనం, శవాగాసనం, సర్వాంగాసనం వంటి ఆసనాలు తేలికగా వేస్తాడు. క్రమంతప్పకుండా వేకువజామున సూర్య నమస్కారాలు, ప్రాణాయామం చేస్తున్నాడు. నిత్య యోగా సాధన, శాఖాహారం తీసుకోవడం వల్ల ఇప్పటికీ చురుగ్గా ఉంటున్నాడు.

స్కూళ్లలో యోగాకు ఒక పీరియడ్ కేటాయించాలి

ప్రతి ఒక్కరూ చిన్నప్పటి నుంచే యోగా సాధన చేయడం అలవాటు చేసుకోవాలి. యోగా సాధనతో ఆరోగ్యంతో పాటు బుద్ధి కుశలత, ఆలోచన శక్తి, ఆత్మస్థైర్యం పెంపొందుతుంది. గుండె జబ్బులు, శ్వాసకోశ సంబంధిత వ్యాధులను అవలోకగా అధిగమించవచ్చు. కరోనా వంటి విపత్కర పరిస్థితులను తట్టుకోగలం. పాఠశాలల్లో ఒక పీరియడ్ యోగాకు కేటాయిస్తే చాలా మంచింది.

-పున్న నరసింహ, వెల్లంకి

21 మందికి రూ.13.87 లక్షలు

యాదగిరిగుట్ట రూరల్: స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) ఆధ్వర్యంలో ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. అందులో భాగంగా చిరు వ్యాపారాలు, వాహనాల కొనుగోళ్లు, వ్యవసాయం తదితర అవసరాలకు స్త్రీ నిధి రుణాలు పొందిన వారికి రుణ బీమా, ప్రమాద బీమా పథకాలు వర్తింపజేస్తుంది. రుణగ్రస్తురాలు చనిపోతే వారి కుటుంబ సభ్యులకు ఇన్సూరెన్స్ డబ్బులను అందజేస్తుంది. వివిధ కారణాలతో 75 మంది చనిపోగా.. తొలి విడతలో 21 మందికి బీమా మంజూరైంది.

మృతుల నామినీ ఖాతాల్లో జమ

రుణబీమా 72, ప్రమాద బీమాకోసం ముగ్గురు దరఖాస్తు చేసుకున్నారు. మొదటి విడతగా 21 మందికి రూ.13,87146 లబ్ధి చేకూరింది. మృతి చెందిన సభ్యురాలు తీసుకున్న రుణం తీసేసి, మిగిలిన డబ్బులను నామినీ ఖాతాల్లో ప్రభుత్వం వేసింది.

పూర్తి సమాచారంతో రావాలి



మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు, పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

- కలెక్టర్ హనుమంతరావు
- నేడు అధికారులతో ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ సమావేశం

భువనగిరిటౌన్ : రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్న సమీక్ష సమావేశానికి సంబంధిత శాఖల అధికారులు పూర్తి సమాచారంతో రావాలని కలెక్టర్ హనుమంతరావు ఆదేశించారు. శుక్రవారం అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, భాస్కర్‌రావుతో కలిసి కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ పర్యటన ఏర్పాట్లపై సమీక్షించారు. ఎస్సీ, ఎస్టీ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాలపై 2024–25, 2025–26 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి పూర్తి సమాచారంతో హాజరుకావాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్డీఓలు కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, ఎస్సీ సంక్షేమ అధికారి శ్యాంసుందర్, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, జిల్లా పంచాయతీరాజ్ ఆఫీసర్ సునంద తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు చేరుకున్న ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్

జిల్లా పర్యటనలో భాగంగా రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో పాటు ఐదుగురు సభ్యులు శుక్రవారం రాత్రి యాదగిరిగుట్టకు చేరుకున్నారు. ప్రెసిడెన్షియల్ సూట్‌లో రాత్రి బస చేశారు. వారికి అదనపు కలెక్టర్లు భాస్కర్‌రావు, వీరారెడ్డి స్వాగతం పలికారు. చైర్మన్, సభ్యులు శనివారం ఉదయం యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహిస్తారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయంలో జరిగే సమావేశంలో పాల్గొంటారు.

- తొమ్మిది విభాగాల్లో పోటీ
- జిల్లాలో 428 గ్రామ పంచాయతీలు
- ఈ నెలాఖరు వరకు దరఖాస్తు గడువు

పురస్కారమే లక్ష్యంగా..

జాతీయస్థాయి అవార్డులకు సిద్ధమవుతున్న పల్లెలు

భువనగిరిటౌన్ : జాతీయస్థాయి పురస్కారాలకు పల్లెసీమలు సిద్ధమవుతున్నాయి. తొమ్మిది విభాగాల్లో కేంద్రం ఇచ్చే అవార్డులకు.. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు పోటీపడనున్నాయి. ఈ నెలాఖరు వరకు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ప్రగతి ఆధారంగా పంచాయతీలను అవార్డులకు ఎంపిక చేస్తారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 24న జరిగే పంచాయతీరాజ్ దివస్ ఉత్సవాల్లో కేంద్రం అవార్డులు ప్రదానం చేయనుంది. స్థానిక సంస్థల కలెక్టర్ భాస్కర్‌రావు ఈనెల 17న కలెక్టరేట్‌లో ఎంపీడీఓలు, మండల ప్రత్యేక అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి పురస్కారాలకు సంబంధించిన మార్గదర్శకాలు వెల్లడించారు.

సిబ్బందికి ఈనెలాఖరులో శిక్షణ

జిల్లావ్యాప్తంగా 428 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అన్ని పంచాయతీలు జాతీయ పురస్కారాలకు పోటీపడే విధంగా అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా పంచాయతీ కార్యదర్శులకు ఈ నెల చివరి వారంలో శిక్షణ ఇవ్వనున్నారు. పోటీల్లో పాల్గొనే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రతలు, నియమ నిబంధనలను శిక్షణలో వివరించనున్నారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిలో అవార్డులు అందజేసి నగదు ప్రోత్సాహకం అందజేయనున్నారు.

నిబంధనలు ఇవీ..

2024–25 ఆర్థిక సంవత్సరంలో గ్రామ పంచాయతీ పనితీరు ప్రాతిపదికన అవార్డులకు ఎంపిక చేస్తారు. ప్రతి అంశానికి ఒక నిర్దిష్టమైన ప్రశ్నావళిని రూపొందించి వెబ్‌సైట్‌లో ఉంచారు. రికార్డుల నిర్వహణ, ఆడిట్ రిపోర్టులు, అభివృద్ధి ఫొటోలు, వీడియోలు, గతంలో అవార్డులు పొందిన సర్టిఫికెట్లతో వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ప్రతి పంచాయతీ నుంచి వచ్చిన నివేదికలను ఎంపీడీఓ చైర్మన్‌గా, ఎంపీఓ కన్వీనర్‌గా ఉన్న కమిటీలు పరిశీలిస్తాయి. జిల్లాస్థాయిలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చైర్మన్‌గా, డీపీఓ, జెడ్పీ సీఈఓ కన్వీనర్‌గా ఆయా శాఖల అధికారులు సభ్యులుగా ఉన్న కమిటీకి సిఫారసు చేస్తాయి. వీటిని పరిశీలించిన జిల్లా స్థాయి కమిటీ రాష్ట్రానికి సిఫారసు చేస్తుంది. అక్కడి నుంచి పంపిన దరఖాస్తులను ఢిల్లీలోని నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్ పరిశీలించి ఉత్తమంగా ఉన్న పంచాయతీలను అవార్డులకు ఎంపిక చేస్తుంది.



రాజాపేట మండలం రేణికుంట గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో పచ్చదనం

తొమ్మిది కేటగిరీలు..

- పేదరిక రహిత జీవనోపాధి కలిగిన పంచాయతీ
- ఆరోగ్యకర పంచాయతీ
- టీబీ విముక్త..
- తాగునీటి సరఫరాలో స్వయం సమృద్ధి
- పరిశుభ్రత, పచ్చదనం
- స్వయం సమృద్ధి, మౌలిక వసతులు
- సామాజిక న్యాయం
- మంచి పాలన
- మహిళల అభ్యున్నతికి చేపట్టిన కార్యక్రమాలు

తొమ్మిది విభాగాలకు సంబంధించి 147 ప్రశ్నల ద్వారా ప్రజల నుంచి సమాధానాలు రాబట్టి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు.

- ప్రత్యేక విద్యుత్ లైన్, సబ్‌స్టేషన్ ఏర్పాటులో అలసత్వం
- నల్లగొండ డిపోకు 15 రోజుల క్రితం వచ్చిన 40 ఎలక్ట్రిక్ బస్సులు
- వాటిని నార్కట్‌పల్లి డిపోలో భద్రపరిచిన అధికారులు
- కాంట్రాక్టు సంస్థ నిర్లక్ష్యంతో డిపో దాటని బస్సులు

'ఈవీ'లకు నో పవర్!

చార్జింగ్ సౌకర్యం లేక రోడ్డెక్కని ఎలక్ట్రిక్ బస్సులు



నార్కట్‌పల్లి ఆర్టీసీ డిపోలో ఉన్న ఎలక్ట్రిక్ బస్‌లు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : జిల్లాలో ఎలక్ట్రిక్ బస్సు (ఈవీ)లకు చార్జింగ్ కష్టాలు వచ్చిపడ్డాయి. ఎలక్ట్రిక్ బస్సులకు అవసరమైన చార్జింగ్ కోసం విద్యుత్ లైన్, సబ్‌స్టేషన్ నిర్మాణంలో ఎడతెగని జాప్యం జరుగుతోంది. ఆ పనుల కోసం మూడు నెలల కిందటే టెండర్లు పిలిచినా కాంట్రాక్టు సంస్థ అలసత్వంతో ఈవీ బస్సులు రోడ్డెక్క లేదు. దీంతో నల్లగొండ డిపోకు కేటాయించిన 40 ఈవీ బస్‌లను నార్కట్‌పల్లి డిపోలో భద్రపరిచారు. సూర్యాపేట, నల్లగొండ డిపోలకు ఒకేసారి ఈవీ బస్‌లు వచ్చాయి. 11 కేవీ లైన్, సబ్‌స్టేషన్, ఛార్జింగ్ పాయింట్ల నిర్మాణ బాధ్యతలను రెండుచోట్ల ఒకేసారి కాంట్రాక్టు సంస్థకు అప్పగించారు. సూర్యాపేటలో ఇప్పటికే ఆ పనులన్నీ పూర్తయి బస్‌లు రోడ్డెక్కగా, నల్లగొండలో మాత్రం పనుల్లో జాప్యం జరుగుతోంది.

పనుల్లో ఎడతెగని జాప్యం

ఖర్చులను తగ్గించుకోవాలనే ఉద్దేశంతో ఆర్టీసీ ఈవీ బస్‌లను తీసుకొస్తోంది. అందులో భాగంగా నల్లగొండ, సూర్యాపేట డిపోలకు ఎలక్ట్రిక్ బస్‌లను మంజూరు చేసింది. అందుకోసం ఈ రెండు డిపోల్లో ప్రత్యేకంగా 133/11 కేవీ లైన్, సబ్‌స్టేషన్ నిర్మించాల్సి ఉంది. వాటితోపాటు జనరేటర్ల ఏర్పాటు, ఛార్జింగ్ పాయింట్ల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. సూర్యాపేట, నల్లగొండ జిల్లాలో ఒకే కాంట్రాక్టర్ కాంట్రాక్టు పొందినప్పటికీ సూర్యాపేటలో పనులను ఎప్పుడో పూర్తి చేశారు. ఈ నెల 9వ తేదీన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సూర్యాపేటలో ఈవీ బస్సులను ప్రారంభించారు. నల్లగొండ డిపోలో మాత్రం ఛార్జింగ్ పాయింట్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నా, ప్రత్యేక లైన్, సబ్‌స్టేషన్ పనుల్లో వేగం పుంజుకోవడం లేదు.

తాత్కాలిక లైన్‌తో తలెత్తనున్న సమస్యలు

నల్లగొండలోని హైదరాబాద్ రోడ్డు సబ్‌స్టేషన్ నుంచి 133/11 కేవీ ప్రత్యేక లైన్‌ను డిపో వేయాల్సి ఉండగా.. ఆ విషయంలో కాంట్రాక్టు సంస్థ అలసత్వం ప్రదర్శిస్తోందని అధికారులే చెబుతున్నారు. అయితే బస్టాండ్ సమీపంలోని విద్యుత్ లైన్ నుంచి తాత్కాలికంగా డిపో వరకు లైన్ వేసేందుకు సిద్ధమయ్యారు. దానివల్ల మరిన్ని సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. ప్రస్తుతం సుబాష్ విగ్రహం నుంచి వెళ్లే 133/11 కేవీ లైన్ పరిధిలో చాలా ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. ఆయా ట్రాన్స్‌ఫార్మర్లలో ఎక్కడ సమస్య వచ్చినా, సబ్‌స్టేషన్‌లో ఎల్‌సీ తీసుకుంటారు. ఆ సమయంలో ఆర్టీసీ ఛార్జింగ్ యూనిట్‌కు కూడా విద్యుత్ నిలిచిపోతుంది. దీంతో బస్‌లకు ఛార్జింగ్ విషయంలో అంతరాయం ఏర్పడుతుంది. జనరేటర్ ఉన్నా కొంత సమయం వరకే వస్తుంది. అందుకే మెయిన్ సబ్‌స్టేషన్ నుంచి ప్రత్యేక్ లైన్ కోసం ఆర్టీసీ.. విద్యుత్ శాఖకు డబ్బులను చెల్లించింది. కానీ కాంట్రాక్టు సంస్థ ఆ పనుల్లో అలసత్వం ప్రదర్శిస్తోంది.

నెలాఖరు వరకు రోడ్డెక్కేది అనుమానమే

ఎలక్ట్రిక్ బస్సులు జిల్లాకు చేరి 15 రోజులు కావస్తోంది. విద్యుత్ లైన్, సబ్‌స్టేషన్ పనులేవీ చేపట్టలేదు. ఇప్పటికిప్పుడు పనులు ప్రారంభించి.. రాత్రింబవళ్లు పనిచేసినా ఈ నెలాఖరు వరకు కూడా అవి పూర్తికావు. బస్ డిపోలో ఇప్పటివరకు జనరేటర్లను ఏర్పాటు చేసి, ఛార్జింగ్ పాయింట్ల పనులను మాత్రమే చేపట్టారు. విద్యుత్ లైన్, సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తేనే వాటికి కనెక్షన్ ఇవ్వాల్సి ఉంటుంది. అప్పటివరకు బస్సులు డిపోకు పరిమితం కావాల్సిందే.

కాంట్రాక్ట్ సంస్థకు నోటీసులు ఇచ్చాం

నల్లగొండ డిపో వద్దకు విద్యుత్ లైన్ ఏర్పాటు, సబ్‌స్టేషన్ నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతుండటంతో కాంట్రాక్ట్ సంస్థకు నోటీసులు ఇచ్చాం. హైదరాబాద్ రోడ్డు నుంచి స్తంభాలు వేసి, లైన్ ఏర్పాటు చేయడానికి సమయం పడుతుందని కాంట్రాక్ట్ సంస్థ అంటోంది. తాత్కాలికంగా సుభాష్ విగ్రహం వద్ద నుంచి వెళ్తున్న 133/11 కేవీ లైన్ నుంచి నుంచి డిపోకు లైన్ వేసే పనులు ప్రారంభిస్తామని చెప్పింది. ప్రత్యేకంగా లైన్‌కోసం ఆర్టీసీ అధికారులు అడిగారని.. ఆ పనులను కూడా త్వరలో ప్రారంభించి, రెండు నెలల్లో పూర్తిచేస్తామని కాంట్రాక్ట్ సంస్థ చెప్పింది.

– వెంకటేశ్వర్లు, ఎస్ఈ ఆపరేషన్, నల్లగొండ

క్లుప్తంగా

భార్య సంపాదనపై ఆధారపడుతున్నానని..

● మనస్తాపంతో ఉరేసుకుని ఆత్మహత్య

సంస్థాన్‌నారాయణపురం: చేసిన అప్పులు తీర్చ లేకపోవడంతోపాటు, భార్య సంపాదనపై ఆధారపడుతున్నానని మనస్తాపనకు గురైన వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం సర్వేల్ గ్రామంలో చేసుకుంది. ఎస్‌ఐ జగన్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ సిద్దిక్(26) అఫీజాబేగంలు రెండేళ్ల క్రితం వివాహం చేసుకున్నారు. సిద్దిక్ కారు కొనుగోలు చేసి నడిపించేవాడు. తిరిగి దానిని అమ్మివేసి, క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సంవత్సరం క్రితం అఫీజాబేగంకు సర్వేల్ గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయురాలి ఉద్యోగం రావడంతో వీరు సర్వేల్‌కు వచ్చి అద్దె ఇంట్లో ఉంటున్నారు. అప్పులు ఎక్కువ కావడంతోపాటు, భార్య సంపాదనపై ఆధారపడుతున్నానని సిద్దిక్ మనస్తాపానికి గురయ్యాడు. భార్య శుక్రవారం పాఠశాలకు వెళ్లగా, ఇంట్లో ఒంటరిగా ఉన్న సిద్దిక్ ఉరివేసుకున్నాడు. ఆమె పాఠశాల నుంచి ఇంటికి వచ్చి చూసేసరికి విగతజీవిగా వేలాతున్నాడు. ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి బలవన్మరణం

బీబీనగర్ : ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు చెట్టుకు ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని జైనపల్లి గ్రామ శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. సీఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జనగాం జిల్లా రఘునాథ్‌పల్లి మండలం మండేలగూడెం గ్రామానికి చెందిన డ్యగాల కిరణ్(26) హైదరాబాద్‌లోని ఆమెజాన్ ఆన్‌లైన్ కొరియర్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. కిరణ్ 3సంవత్సరాల క్రితం ఓ అమ్మాయిని ప్రేమిస్తున్నాడు. ఈ క్రమంలో అతడికి ఖర్చులు బాగా పెరిగి ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండడంతో అమ్మాయి అతడి నుంచి దూరమైంది. దీంతో కిరణ్ జీవితంపై విరక్తి చెంది శుక్రవారం తెల్లవారు జామున బీబీనగర్ సమీపంలోని జైనపల్లి గ్రామపరిధిలోకి చేరుకొని చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో గ్రామస్తులు గమనించి పోలీస్‌లకు సమాచారం ఇవ్వగా సంఘటనా స్థలానికి చేరుకొని మృతుడి తల్లిదండ్రులకు సమాచారం అందించి మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఎల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



కిరణ్ మృతదేహం

స్వర్ణగిరి క్షేత్రంలో కుంకుమార్చన



కుంకుమార్చన నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

భువనగిరి: భువనగిరి పట్టణ శివారులోని స్వర్ణగిరి క్షేత్రంలోని శ్రీ వేంకటేశ్వర దేవాలయంలో శుక్రవారం అష్టోత్తర శత నామాలతో విశేష కుంకుమార్చన సేవ కార్యక్రమం నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలో ఉదయం స్వామి వారికి సుప్రభాతసేవ, తోమాల సేవ, సహస్రనామార్చన, సేవ, నిత్య కల్యాణమహోత్సవం జరిపించారు. మధ్యాహ్నం సుమారు 3వేల మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం తిరువీధి ఉత్సవ సేవ, కర్పూర మంగళహారతులు సమర్పించారు.

అనుమానాస్పదంగా మహిళల సంచారం

మోత్కూరు : అనుమానాస్పదంగా సంచరిస్తున్న మహిళలను గ్రామస్తులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటన మండలంలోని ముశిపట్ల గ్రామంలో వెలుగులోకి వచ్చింది. గురువారం గ్రామంలో దొంగతనానికి రెక్కి నిర్వహిస్తున్న నలుగురు మహిళలను గ్రామస్తులు గుర్తించి పట్టుకొని ఆరా తీశారు. మధ్యాహ్న సమయంలో గ్రామంలో సంచరిస్తుండగా అనుమానం వచ్చిన పలువురు వారిని నిలదీశారు. వారు సరైన సమాధానం చెప్పకపోవడంతో అనుమానం బలపడింది. ఈ క్రమంలో వారు తప్పించుకునే ప్రయత్నం చేయగా గ్రామపంచాయతీ వద్దకు తీసుకెళ్లి పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు నలుగురు మహిళలను విచారించారు. వరంగల్ జిల్లాకు చెందిన వాసులుగా గుర్తించారు. వరంగల్‌లోని రెడ్డినగర్, హన్మకొండ, కాజీపేట, మడికొండలకు చెందిన తుర్పతి మైసమ్మ, స్వాతి, శారద, సునీతగా పోలీసులు గుర్తించారు. వారిపై ఇప్పటికే నాలుగు దొంగతనం కేసులు నమోదైనట్లు ప్రొబెషనరీ ఎస్‌ఐ నోయల్ రాజు తెలిపారు.

కేతేపల్లి పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

నల్లగొండ: విధుల్లో నిర్లక్ష్యం వహించిన కేతేపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లును సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వెంకటేశ్వర్లు కేతేపల్లిలోని ఇంటి నంబర్ 2- 97/1 కు సరైన పత్రాలు లేకుండానే నివాస ధ్రువీకరణ పత్రం జారీ చేసి, విధుల్లో నిర్లక్ష్యం వహించారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సోషల్ సర్వీస్!

- సోషల్ మీడియా ద్వారా గ్రామస్తుల బాగోగులు
- 'మన ఊరు-మన గుజ్జ' పేరుతో పేజీల నిర్వహణ
- పుష్కరకాలంగా కృషిచేస్తున్న యువకుడు శశికాంత్

ఫేస్‌బుక్... యూట్యూబ్... ఇన్‌స్టాగ్రామ్... వాట్సాప్... ఇలా సోషల్‌మీడియాను యువత సరదా కోసమో, వినోదం కోసమో వినియోగిస్తారనే భావన అనేక మందిలో ఉంటోంది. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూర్ మండలం గుజ్జ గ్రామానికి చెందిన శ్రీరామోజు శశికాంత్ మాత్రం వీటి వినియోగంతో సామాజిక సేవ చేస్తున్నారు. డిగ్రీ చేసిన ఈయన 'మన ఊరు-మన గుజ్జ' పేరుతో ఆయా వేదికల్లో పేజీలు నిర్వహిస్తూ గ్రామానికి, గ్రామస్తులకు సేవ చేస్తున్నారు. 12 ఏళ్లుగా అప్రతిహతంగా తన కృషిని కొనసాగిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. ఆలోచన మాత్రమే తనదని, ఆచరణలో మాత్రం గ్రామం మొత్తం పాలుపంచుకుంటోందని శశికాంత్ చెబుతున్నారు

– సాక్షి ప్రతినిధి, నల్లగొండ



స్వచ్ఛంద సంస్థల సహకారంతో గ్రామ మహిళలకు స్వయం అభివృద్ధి, కుటీర పరిశ్రమల ఏర్పాటుపై నిర్వహించిన సమావేశం (ఫైల్)

గుజ్జ నుంచి దేశ విదేశాలకు వెళ్లి స్థిరపడిన వారు అనేక మంది ఉన్నారు. వారితో పాటు ప్రపంచంలో ఉన్న తెలుగు వారందరికీ ఎప్పటికప్పుడు ఊరి విశేషాలను చేరవేయడం.. అవసరమైతే వాళ్లు ఓ చేయి వేసి చేయూత అందించేలా చేయడం ఈ 'సోషల్ మీడియాల' గొప్పదనం. గుజ్జ యువతలో సేవాదృక్పథాన్ని నింపేలా 2013 నుంచి ఈ 'సామాజిక ఉద్యమం' కొనసాగుతోంది. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన గుజ్జ గ్రామస్తులకు ఊరిలో ఏం జరుగుతోంది? ఏయే పండుగలు ఎలా జరుగుతున్నాయి? తదితర వివరాలను ఎప్పటికప్పుడు ఈ పేజీలు అందిస్తున్నాయి.

'మన ఊరు - మన గుజ్జ పేరుతో రూపొందించిన లోగో

ఎందరో ఆపన్నులకు ఆసరాగా నిలిచి...

'మన ఊరు - మన గుజ్జ వేదికను శశికాంత్ ఆ గ్రామంలో ఉన్న, గ్రామం నుంచి వెళ్లి వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన గ్రామస్తుల సహకారంతో ముందుకు నడిపిస్తున్నారు. హఠాన్మరణం పొందిన వారి కుటుంబాలకు, అనారోగ్యానికి గురైన వారికి, ఆసుపత్రిల్లో వైద్యం అవసరమైన వారికి ఆర్థిక సహాయం, తోడ్పాటు అందేందుకు ఈ ‹మన ఊరు-మన గుజ్జ' పేజీలు పనిచేస్తున్నాయి. రోడ్డు ప్రమాదంలో మరణించిన గంగదేవి తిరుమలేష్ భార్య, నలుగురు పిల్లలకు, రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ నల్లగంటి చందుకు, మెదడులో రక్తం గడ్డకట్టడంతో ఆస్పత్రిలో చేరిన మంగ లింగమ్మకు వైద్యం కోసం, క్రికెట్‌లో ప్రతిభ కనబరుస్తున్న గోపరాజు సాయి అర్జున్‌కు అవసరమైన డబ్బు సమకూర్చడంలోనూ ఈ పేజీలు కీలకపాత్ర పోషించాయి. వీరితో పాటు గ్రామంలో ఉన్న వృద్ధులు, విద్యార్థుల కోసమూ అనేక సహాయ కార్యక్రమాలు వీటి ద్వారా జరుగుతున్నాయి.

సంప్రదాయ, సంస్కృతులు చాటిచెప్పేలా..

శశికాంత్ గుజ్జ గ్రామస్తులతో కలిసి ఈ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ ద్వారా సంప్రదాయ, సంస్కృతులు అందరికీ చాటిచెప్పడానికీ కృషిచేస్తున్నారు. వాటికి అద్దం పట్టేలా బతుకమ్మ పాటల పోటీల నిర్వహణ, గ్రామ చరిత్ర, గొప్పదనం వివరిస్తూ.. రెండు బతకమ్మ పాటలు రాసి, పాడించి చిత్రీకరణ చేయించారు. జాతీయ నాయకుల జయంతులు, వర్ధంతులు క్రమం తప్పకుండా నిర్వహిస్తూ, వారి త్యాగాలు ఈ తరం యువతకు తెలిసేలా చేస్తూ వారిలో చైతన్యం నింపుతున్నారు. సేవ చేయాలన్న తపన, ఊరి కోసం పని చేయాలన్న సంకల్పం పెరిగేందుకు కృషి చేస్తున్నారు.

గ్రామంలో అవగాహన సదస్సుల నిర్వహణ

సోషల్ మీడియా వేదిక ద్వారా పలువురిని ఆకర్షిస్తున్న శశికాంత్ వారితో గ్రామంలో అవగాహన సదస్సులు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మహిళల స్వయం ఉపాధి, స్వయం సమృద్ధి కోసం ప్రాథమిక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గత నెలలో గుజ్జ రైతు వేదిక వద్ద స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు తోట రాము సహకారంతో వృత్తి నైపుణ్యాల పెంపుదల, వివిధ పథకాల కింద రుణాలు పొందే అవకాశం, కుటీర పరిశ్రమల ఏర్పాటు, మార్కెటింగ్ సాయం పొందే విధానాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు వివిధ వర్గాల్లో ఉన్నతంగా ఉన్న వారి సహాయ, సహకారంతో శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పించేలా కృషి చేస్తున్నారు.

గ్రామస్తుల సహకారంతోనే సేవ



గ్రామస్తుల సహకారంతోనే 'మన ఊరు- మన గుజ్జ' సోషల్ మీడియాను ప్రారంభించాను. గ్రామస్తులు ఒక్కొక్కరుగా చేరడంతో సోషల్ మీడియాలో గ్రామస్తులమంతా టీంగా ఏర్పడ్డాం. సహాయ, సహకారాల్లో గ్రామం మొత్తం భాగస్వామ్యమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి ప్రతి గ్రామ పంచాయతీకి సోషల్ మీడియా గ్రూపులను ఏర్పాటు చేయాలన్నది నా ఆకాంక్ష. అవకాశం ఉన్న వారు ముందుకు వచ్చి సహాయ సహకారాలు అందిస్తే ఇంకా మెరుగైన సేవలు అందిస్తాం.

– శ్రీరామోజు శశికాంత్

ఆదర్శం.. ఆ ఉపాధ్యాయులు

● తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించిన ఉపాధ్యాయులు

అడ్డగూడూరు: ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు తమ పిల్లలను తాము చదువు చెబుతున్న పాఠశాలల్లోనే చేర్పించి ఆదర్శంగా నిలిచారు. అడ్డగూడూరు మండల పరిధిలోని అజీంపేట ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు నరేష్‌కు కుమార్తె రిషిక, కుమారుడు రిషిదేవ్ ఉన్నారు. శుక్రవారం కుమార్తె రిషికను అదే పాఠశాలలోని 3వ తరగతిలో, కుమారుడు రిష్‌దేవ్ 2తరగతిలో చేర్పించారు. గతంలో వీరు తిరుమలగిరి మండలంలోని ప్రైవేట్ పాఠశాలలో చదివేవారని, విద్యార్థులకు సంపూర్ణ మనో వికాసానికి దోహదపడే బోధన ప్రభుత్వ పాఠశాలల్లోనే అందుతుందని, అందుకే ప్రభుత్వ పాఠశాలలో చేర్పించినట్లు తెలిపారు.



అజీంపేట పాఠశాలలో తన కుమార్తె, కుమారుడితో ప్రభుత్వ ఉపాధ్యాయుడు నరేష్

ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కలిగించేలా..

ఆత్మకూర్ (ఎస్) : మండల పరిధిలోని మక్తా కొత్తగూడెం గ్రామానికి చెందిన మట్టపల్లి సైదులు ఏపూర్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఆయన తన కుమారులైన గణ సాత్విక్, మంజిత్‌లను తాను పనిచేస్తున్న పాఠశాలలోనే శుక్రవారం చేర్పించారు. అనంతరం వారికి ఉపాధ్యాయులు పాఠ్య పుస్తకాలు నోట్ బుక్స్, స్కూల్ యూనిఫాం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కలిగించేందుకే తన ఇద్దరి కుమారులను ఈ పాఠశాలలో చేర్పించినట్లు తెలిపారు.



విద్యార్థులకు పుస్తకాలు, నోట్‌బుక్స్ అందజేస్తున్న ఉపాధ్యాయులు

22న ఉమ్మడి జిల్లా బాలుర ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

నల్లగొండ టూటౌన్: నల్లగొండలోని మేకల అభినవ్ అవుట్‌డోర్ స్టేడియంలో ఆదివారం ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాలుర జూనియర్ ఫుట్‌బాల్ జట్టు ఎంపిక నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ గంట్ల అనంతరెడ్డి, అధ్యక్షుడు బండారు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి బొమ్మపాల గిరిబాబులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1-1-2009 నుంచి 31-12-2011 మధ్య జన్మించిన యాదాద్రి భువనగిరి, సూర్యాపేట, నల్లగొండ జిల్లా వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఉదయం 9 గంటలకు నల్లగొండలోని మేకల అభినవ్ అవుట్‌డోర్ స్టేడియంలో రిపోర్టు చేయాలని తెలిపారు. క్రీడాకారులు వారి ఆధార్ కార్డు, వయసు ధ్రువీకరణ పత్రం, రెండు ఫొటోలు, ఫుట్‌బాల్ కిట్ తో హాజరు కావాలని కోరారు. నల్లగొండలో ఎంపికైన జిల్లా జట్టు ఈనెల 28 నుంచి జూలై1వ తేదీ వరకు నిజామాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారని తెలిపారు.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ కండక్టర్

భువనగిరి : బస్సులో ప్రయాణికుడు మరిచిపోయిన సెల్ ఫోన్‌ను అప్పగించి ఆర్టీసీ కండక్టర్ నిజాయితీ చాటుకున్నాడు. వివరాల ప్రకారం.. భువనగిరి పట్టణానికి చెందిన యానూష్ శుక్రవారం నల్లగొండకు వెళ్లేందుకు భువనగిరి బస్టాండ్‌కు వచ్చి నల్లగొండ డిపోకు చెందిన సెమీ డీలక్స్ బస్సు ఎక్కాడు. యానూష్ తన సెల్ ఫోన్‌ను బస్సులో మర్చిపోయి నల్లగొండ బస్టాండ్‌లో దిగి వెళ్లిపోయాడు. బస్సులో సెల్ ఫోన్‌ను గుర్తించిన కండక్టర్ సీఎస్ రెడ్డి భువనగిరి బస్టాండ్‌కు వచ్చిన తరువాత విషయాన్ని స్థానిక కంట్రోల్‌కు వివరించారు. ఫోన్ మరిచి వెళ్లిపోయిన బంధువుకు సామాజిక కార్యకర్త కదారి వెంకటేశం సమక్షంలో ఫోన్‌ను అప్పగించారు. బస్సులో మరిచిపోయిన సెల్‌ఫోన్‌ను అప్పగించిన కండక్టర్‌ను పలువురు అభినందించారు.

అనుమతి లేకుండా విక్రయిస్తున్న వరి విత్తనాలు సీజ్

గరిడేపల్లి: మండల పరిధిలోని చవ్వారిగూడెం గ్రామంలో అనుమతి లేకుండా విక్రయిస్తున్న వరి విత్తనాలను అధికారులు శుక్రవారం సీజ్ చేశారు. మిర్యాలగూడ శివారులోని తుమ్మడం గ్రామానికి చెందిన కొంత మంది చవ్వారిగూడెం గ్రామం నుంచి అనుమతులు లేని విత్తన బస్తాలను ఆటోలో తీసుకెళ్తుండగా నేరేడుచర్ల పట్టణ శివారులో పోలీసులు పట్టుకున్నారు. ఆరా తీయగా అనుమతులు లేకుండా విత్తనాలు అమ్ముతున్నట్లు గుర్తించారు. ఈమేరకు గరిడేపల్లి మండలం వ్యవసాయ అధికారి ప్రీతమ్‌కుమార్, హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు ఆధ్వర్యంలో చెవ్వారిగూడెం గ్రామానికి వెళ్లి తిప్పన రాంరెడ్డికి చెందిన గోదాంలో తనిఖీ చేశారు. అనుమతులు లేకుండా ఉన్న 150బస్తాల వరి విత్తనాలను సీజ్ చేశారు. కార్యక్రమంలో నేరేడుచర్ల ఎస్‌ఐ రవీందర్‌నాయక్, గరిడేపల్లి ఏఎస్‌ఐ జగన్నాథం పాల్గొన్నారు.

దిర్శించర్లలో 273 క్వింటాళ్లు పట్టివేత

నేరేడుచర్ల : నేరేడుచర్ల మండలం దిర్శించర్ల గ్రామానికి చెందిన ఎస్‌కె జలీల్‌కు చెందిన షెడ్డులో అనుమతులు లేకుండా నిల్వ ఉంచిన 273 క్వింటాళ్ల వరి విత్తనాలను శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. సమాచారం మేరకు హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు, నేరేడుచర్ల ఎస్‌ఐ రవీందర్, వ్యవసాయ అధికారి జావిద్ తనిఖీలు చేసి, వాటిని పట్టుకున్నారు. జలీల్‌పై కేసు నమోదు చేసి, విత్తనాలను ల్యాబ్‌కు పంపించినట్లు అధికారులు తెలిపారు. నిందితుడు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు.



దిర్శించర్ల గ్రామంలో పట్టుబడ్డ వరి విత్తనాలపై విచారణ చేస్తున్న పోలీసులు

చికిత్స పొందుతూ రైతు మృతి

మోత్కూరు : పాము కాటుకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ రైతు మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని దాచారం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు అండెం కరుణాకర్‌రెడ్డి గురువారం తన పొలంలో పనులు చేస్తుండగా పాముకాటుకు గురయ్యాడు. గమనించిన స్థానికులు అతడిని హుటాహుటిన హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య బాలమణి, ఓ కుమార్తె ఉన్నారు. శుక్రవారం గ్రామంలో జరిగిన అంత్యక్రియలో కుమార్తె శృతి తండ్రి మృతదేహానికి తలకొరివి పెట్టింది.



అంత్యక్రియలు నిర్వహిస్తున్న కుమార్తె

పుస్తెలతాడు చోరీ

నార్కట్‌పల్లి : మహిళ మెడలోని పుస్తెలతాడును గుర్తు తెలియని వ్యక్తి చోరీ చేశాడు. ఈ సంఘటన నార్కట్‌పల్లి మండలం మాధవ ఎడవల్లి సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోతనేనిపల్లికి కమ్మంపల్లి స్వామి, అతడి భార్య అండాలు టీవీఎస్ ఎక్సెల్‌పై నార్కట్‌పల్లికి వస్తుండగా వెనక నుంచి బైక్‌పై గుర్తు తెలియని వ్యక్తి వచ్చి అండాలు మెడలోని పుస్తెలతాడును లాక్కెళ్లాడు. పుస్తెలతాడు రోల్డ్‌గోల్డ్ అయినా, దానికి పావుతులం బంగారం పుస్తె, పావుతులం బంగారు గుండ్లు ఉన్నట్లు బాధితురాలు తెలిపింది. స్వామి పోలీసులకు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపారు.

మట్టపల్లిలో విశేష పూజలు

మఠంపల్లి : మట్టపల్లి క్షేత్రంలో శుక్రవారం విశేషపూజలు కొనసాగాయి. శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు విశేషంగా నిర్వహించారు. తర్వాత ఉత్సవమూర్తులను గరుడ వాహనంపై ఆలయ తిరుమాడవీధుల్లో ఊరేగించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్ల పల్లకీ సేవను కృష్ణానది వద్ద ప్రహ్లాద ఘాట్‌కు తరలించి హారతి పూజలు నిర్వహించారు.